సాక్షి జగిత్యాల

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: కార్తీక సోమవారం సందర్భంగా రాజన్నను 30 వేల మంది దర్శించుకున్నారు. రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



గోశాలకు కోడెలు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్ రాజన్న గోశాలలోని 30 కోడెలను సోమవారం వేములవాడ పట్టణం ముదిరాజ్ వీధికి అందజేసినట్లు అధికారులు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
30.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం, రాత్రి చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఆలయాల్లో కార్తీక సందడి



ధర్మపురి దేవస్థానంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ దేవాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రధాన ఆలయంలోని ఉసిరిక చెట్టువద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

కొండగట్టు, ధర్మపురిలో కరీంనగర్ కలెక్టర్ పూజలు



కొండగట్టు ఆలయంలో కలెక్టర్ పూజలు

కొండగట్టు/ధర్మపురి: జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామివార్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సోమవారం దర్శించారు. అర్చకులు ఆమె గోత్రనామాలపై వేదమంత్రాలు చదివి తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మపురిలో ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలతో సన్మానించారు. కొండగట్టులో ఉపప్రధాన అర్చకుడు చిరంజీవస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్‌కి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యేగా విజయం సాధించిన సంజయ్‌కుమార్‌ను సోమవారం పలువురు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. రైతులకు మద్దతు ధర కోసం.. ప్రజాసమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

మెట్‌పల్లి: నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓడిపోయిందని కార్యకర్తలు అధైర్యపడవద్దని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ అధికారంలోకి వచ్చినందున నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాలటౌన్: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ లత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమాచార హక్కు చట్టం, కోర్టు కేసులు, మానవహక్కుల కమిషన్ నుంచి వచ్చే దరఖాస్తులు, లేఖలకు స్పష్టమైన సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచుకోటకు బీటలు

- ఉమ్మడి జిల్లాలో 'కారు'కు ఊహించని ఫలితాలు
- ఏ పథకం మొదలు పెట్టినా ఇక్కడ నుంచే..
- పథకాల అమలులోనూ పక్షపాతం
- పార్టీ నేతల అవినీతి, వెన్నుపోటు రాజకీయాలు ఓటమికి కారణమని అనుమానం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి శాసనసభ ఫలితాల్లో ఊహించని దెబ్బ తగిలింది. తెలంగాణ ఏర్పడ్డాక మొదటిసారిగా శాసనసభకు జరిగిన ఎన్నికల్లో 2014లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా తాటిపర్తి జీవన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మిగతా 12 సీట్లను బీఆర్‌ఎస్ గెలుచుకుని సంచలనం సృష్టించింది. 2018లో జరిగిన ఎన్నికల్లో మంథని నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒక్కరే ఎన్నికయ్యారు. మిగితా 12 చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలువడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గులాబీ పార్టీకి గుండెకాయలా నిలిచింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఎనిమిది సీట్లను గెలుచుకుని గులాబీ కంచుకోటకు బీటలు పారించడడంతో గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఐదు సీట్లకే పరిమితం

బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడం గమనార్హం. రెండు దఫాలుగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఒక్క సీటుకు పరిమితం చేయడమేకాకుండా పది సంవత్సరాలుగా జిల్లా పరిషత్, మండల పరిషత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తూ ప్రతిపక్షాలను చిత్తు చేయడంతో ఆ పార్టీల ఊసే లేకుండాపోయింది. సర్పంచ్ మొదలు ఎమ్మెల్యే, మంత్రుల వరకూ గులాబీ దళపతులే కావడంతో పరిపాలన వ్యవస్థ గాడి తప్పింది. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే క్రమంలో.. లబ్ధిదారుల ఎంపికలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అర్హులకు కాకుండా అనర్హులను ఎంపిక చేయడంతో గ్రామాల్లో అలజడులకు బీజం పోసినట్లయింది. పార్టీ నాయకుల ఒంటెత్తుపోకడలు, వారిని అదుపులో పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు ఉండటంతో క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ పార్టీ అంటేనే గ్రామాల్లో ఒకింత అసహనానికి గురి చేసింది. ఇలా పెత్తనం చెలాయించే వ్యక్తుల సంఖ్య క్రమేపీ పెరిగింది. డబుల్‌బెడ్‌రూం, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, బీసీ చేయూత, గృహలక్ష్మి వంటి పథకాలు ప్రవేశపెట్టిన క్రమంలో చెప్పిన మాటలకు క్షేత్రస్థాయిలో జరిగిన ఆచరణకు పొంతన లేకపోవడంతో పల్లెల్లో ప్రజలు, నాయకులకు మధ్య విభజన రేఖ మొదలైంది. పథకాల అమలు విషయంలో పార్టీ వ్యక్తులు, అనుకూలమైన వారికే కట్టబెట్టడం వంటి సంఘటనలను ప్రజలు మరిచిపోలేకపోయారు. లబ్ధిదారుల అర్హుల జాబితా తయారు చేసే సమయంలో గ్రామాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం, పదుల సంఖ్యలో పథకాలు అమలుకావడంతో ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీపై, నాయకుల తీరుపై చర్చలు తీవ్రస్థాయిలో ఆలోచింపజేసే విధంగా జరిగి అసంతృప్తికి దారి తీశాయి.

మొదలైన పోస్టుమార్టం

గులాబీ జెండాకు అండగా నిలుస్తూ వచ్చిన ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఎనిమిది సీట్లను కట్టబెట్టడం.. బీఆర్‌ఎస్‌కు కేవలం ఐదు సీట్లకు పరిమితం చేయడంపై పార్టీలో పోస్టుమార్టం మొదలైంది. పెద్దపల్లి జిల్లా మొత్తంలో ఒక్కసీటు కూడా రాకపోవడంపై బీఆర్‌ఎస్ అగ్రనేతలు ఆరా తీస్తున్నారు. సింగరేణి కార్మికులు ఉద్యమకాలం నుంచి బీఆర్‌ఎస్ వైపే ఉన్నా.. మంథని, రామగుండం, పెద్దపల్లిలో విజయం సిద్ధించకపోవడంపై పోస్టుమార్టం మొదలైంది. చొప్పదండిలో పోలీసు పోస్టింగుల వివాదం, స్థానిక నేతల మధ్య సయోధ్య కుదరకపోవడం ద్వారా అక్కడ పార్టీ పరాజయం పాలైందని సమాచారం. అలాగే మానకొండూరులో దళితబంధులో అక్రమాలు జరిగాయని, అభివృద్ధి పనులు సరిగా జరగలేదన్న అభిప్రాయం ఓటమికి కారణమై ఉండవచ్చని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. వేములవాడలో బీఆర్‌ఎస్ హోరాహోరీగా పోరాడినా.. కాంగ్రెస్ అభ్యర్థిపై సానుభూతి ముందు నిలవలేకపోయింది. ధర్మపురిలోనూ ఇదే సానుభూతి పవనాలు కాంగ్రెస్ విజయానికి బాటలు వేశాయి. కరీంనగర్‌లో వెన్నుపోటు రాజకీయాలు విజయాన్ని ప్రభావితం చేశాయి. కొందరు కీలక నేతలు ఆఖరు నిమిషంలో పార్టీ మారడం, బీఆర్‌ఎస్‌లో ఉండి ఇతర పార్టీల కోసం పనిచేయడం విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపింది.

ఉమ్మడి జిల్లాకు పెద్దపీట

బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి జిల్లాలో ఈటల రాజేందర్, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌కు మంత్రి పదవులు కట్టబెట్టడమే కాకుండా పదుల సంఖ్యలో రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను జిల్లాకు చెందిన వారికే అవకాశం ఇచ్చారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారించకుండా, జిల్లా, మండల, గ్రామ కమిటీలు లేకుండా, పార్టీ అనుబంధ విభాగాలపై దృష్టిసారించకుండా చోటామోటా నాయకులంతా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడంతో పార్టీపై అజమాయిషీ లేకుండా పోయింది. దీంతో క్షేత్రస్థాయి నాయకుల ప్రవర్తనకు, వారు చేస్తున్న అవినీతికి విసిగివేసారిన ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న తరుణంలో శాసనసభ ఎన్నికలు వచ్చాయి. ప్రత్యామ్నాయ రూపంలో కాంగ్రెస్ పార్టీ కనబడడంతో ఆ పార్టీ వైపే అన్ని వర్గాల ప్రజలు మొగ్గు చూపారు. ఇది బీఆర్‌ఎస్ పార్టీ కోటకు బీటలు పడినట్లయింది. ధరణితో ఒకరి భూములు ఒకరికి మారాయని కార్యాలయాల చుట్టూ తిరిగినా రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించకపోవడం, మార్గం చూపించకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రెవెన్యూ, కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట బాహాటంగానే నిరసనలకు దిగిన సంఘటనలు కోకొల్లలుగా జరిగాయి.

కొంపముంచిన అవినీతి, వెన్నుపోటు రాజకీయాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగడం, క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు ద్వితీయ శ్రేణి నాయకులు చేతివాటం ప్రదర్శించడంతో గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల అవినీతికి అడ్డూఅదుపు లేకుండాపోయింది. పార్టీని సమన్వయం చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలదరికి చేర్చాల్సిన ప్రజాప్రతినిధులు.. గ్రామాల్లో రెండుగా విడిపోయి వర్గాలుగా తయారుకావడం, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడటం లాంటి విషయాలు పార్టీని కోలుకోని దెబ్బతీశాయని చెప్పవచ్చు. ఏదేమైనా 2001లో ఎస్సారార్ కళాశాల మైదానం వేదికగా జరిగిన సింహగర్జన బహిరంగ సభ నుంచి, తెలంగాణ ఉద్యమంలో ప్రతి సందర్భాన్ని కరీంనగర్ నుంచే ఉద్యమాన్ని రగిలించడం, చివరకు 2009లో తెలంగాణ కోసం కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకోవడం లాంటి సంఘటనలు ఉద్యమ తొలినాళ్లల్లో మరిచిపోలేని సంఘటనలు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలన్నింటికి ఉమ్మడి కరీంనగర్ జిల్లానే వేదిక కావడం మరిచిపోలేని విషయం.

కేసీఆర్‌ను కలిసిన సంజయ్



కేసీఆర్‌తో సంజయ్‌కుమార్

జగిత్యాల/రాయికల్: కేసీఆర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో సోమవారం కలుసుకున్నారు. సంజయ్ ఎమ్మెల్యేగా గెలవడంపై కేసీఆర్ అభినందనలు తెలిపారు. అనంతరం సంజయ్ ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో కలిశారు.

ప్రజాతీర్పును శిరసావహిస్తా..



కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని ధర్మపురి నుంచి బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన కొప్పుల ఈశ్వర్ తెలిపారు. పార్టీ గెలుపుకోసం రెండు నెలలుగా అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలు, నాయకులు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరు పర్యాయాలు తనకు ఓటేసి గెలిపించారని, వారి రుణం తీర్చుకోవడానికి ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రజల వెంటే ఉంటానని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భూపతిపూర్ విద్యార్థి



సమీర్

రాయికల్: మండలం భూపతిపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సమీర్ ట్రిపుల్ జంప్ సీనియర్ విభాగంలో మొదటిస్థానం, హైజంప్‌లో మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ బందెల శ్రీనివాస్ తెలిపారు. సమీర్‌ను ఎస్‌ఎంసీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం వెంకటరమణి, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అమాత్య అవకాశం ఎవరికో..?

- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో తీవ్రపోటీ
- రేసులో పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి



దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పొన్నం ప్రభాకర్



జీవన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి పదవులు చర్చ మొదలైంది. సీఎం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కేబినెట్ ఏర్పాటు చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు పోటీపడుతున్నారు. వీరిలో ముఖ్యంగా గతంలో మంత్రిగా పనిచేసిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌లను కేబినెట్‌లోకి తీసుకుంటారని ప్రచారం సాగుతోంది. 13 స్థానాలు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాలుగు కొత్త జిల్లాలుగా ఆవిర్భావించిన నేపథ్యంలో జిల్లాకు ఒక మంత్రి చొప్పున ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు తెలిపారు. గతంలో కేటీఆర్(సిరిసిల్ల), కొప్పుల ఈశ్వర్(ధర్మపురి), గంగుల కమలాకర్(కరీంనగర్), ఈటల రాజేందర్ (హుజూరాబాద్) నలుగురు మంత్రులుగా కొనసాగారని గుర్తు చేస్తున్నారు.

పోటీలో కొత్తవారు సైతం...

సీనియర్ నాయకులతో పాటు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నాయకులు కూడా మంత్రి మండలిలో చోటు లేదా పార్టీ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీరిలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు కీలక బాధ్యతలు చేపట్టాలని ఉత్సాహంగా ఉన్నారు. పాత జిల్లాలో ఐక్యమత్యంతో పోరాడి 13 అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిదింటిని కైవసం చేసుకున్న హస్తం నేతలు ఎన్నికల అనంతరం కూడా తాము ఇదే వైఖరితో ఐక్యంగా రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతామని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావులు కూడా కేబినెట్‌లో చోటు ఆశిస్తున్నారని తెలిసింది. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సీనియర్లకు మంత్రి పదవులు, తొలిసారిగా గెలిచిన వారికి సామర్థ్యాన్ని బట్టి సహాయ మంత్రి లేదా పార్టీలో కీలక బాధ్యతలు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో జగిత్యాల అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈయన కూడా గతంలో అనేక మంత్రిత్వ శాఖలు నిర్వహించారు. ఇప్పటికి శాసన మండలి సభ్యుడిగా కొనసాగుతుండడంతో ఆయనను మంత్రి మండలిలోకి లేదా స్పీకర్ పదవికి ఎంపిక చేయవచ్చునని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

పట్టు నిలుపుకున్న బీఆర్‌ఎస్

- కాంగ్రెస్ హవాలోనూ జిల్లాలో రెండు స్థానాలు కైవసం
- జగిత్యాల నుంచి రెండోసారి సంజయ్‌కుమార్ విజయం
- కోరుట్ల నుంచి పోటీ చేసిన తొలిసారే సంజయ్ గెలుపు
- ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పరాభవం

జగిత్యాల: రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగినా.. జగిత్యాల జిల్లాలో మాత్రం బీఆర్‌ఎస్ తన పట్టు నిలుపుకుంది. జగిత్యాలతోపాటు కోరుట్ల (రెండు స్థానాలు)ను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. జగిత్యాలలో రసవత్తరంగా సాగిన పోటీలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌నే రెండోసారి విజయం వరించింది. మొదటిసారి 2014లో బీఆర్‌ఎస్ టికెట్ దక్కించుకున్న సంజయ్‌కుమార్ జీవన్‌రెడ్డిపై ఓటమిపాలయ్యారు. 2018లో పుంజుకుని భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆయన హయాంలోనే జగిత్యాల జిల్లా కేంద్రం కావడం.. రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు 4,520 మంజూరుకావడం ఆయనకు కలిసి వచ్చింది. అలాగే మెడికల్ కళాశాల తీసుకురావడంలోనూ సంజయ్ ప్రధాన పాత్ర పోషించారు. ప్రతిరోజు పల్లెనిద్ర కార్యక్రమాలు చేపడుతూ అభివృద్ధికి తోడయ్యారు. ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తారనే పేరు కూడా ఆయన విజయానికి దోహదపడింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కూడా నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రతిరోజు మండలాలు, గ్రామాలు తిరుగుతూ గట్టిపట్టు సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయనకు గ్రామీణ ప్రాంతాల్లో ఓట్లు అత్యధికంగానే పడ్డప్పటికీ జిల్లాకేంద్రానికి వచ్చేసరికి తగ్గిపోయాయి. దీంతో ఆయన ఓటమి చవిచూడాల్సి వచ్చింది. మరోవైపు జగిత్యాల నుంచి ఇప్పటివరకు ఎవరూ వరుసగా గెలిచిన వారు లేరు. దానిని సంజయ్ కుమార్ బ్రేక్ చేశారు.

తొలిసారి అసెంబ్లీకి..

కోరుట్ల నియోజకవర్గంలో వరుసగా గెలుస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఈసారి తన తనయుడు డాక్టర్ సంజయ్‌ని నిలబెట్టుకుని గెలిపించుకున్నారు. తొలిసారి డాక్టర్ సంజయ్ అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. ఆయన తండ్రి అధికార పార్టీలో అడుగుపెట్టగా.. సంజయ్ మాత్రం ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

బీఆర్‌ఎస్ కోటాలో కాంగ్రెస్ పాగా

వరుసగా ధర్మపురిలో గెలుస్తూ వచ్చిన కొప్పుల ఈశ్వర్‌కు ఈసారి బ్రేక్ పడింది. నాలుగు పర్యాయాలు ఓడిపోయిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై విజయం సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, ధర్మపురి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ గెలవడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌ను వీడే ఆలోచన ఎప్పటికీ రాదు

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి: బీఆర్‌ఎస్ పార్టీని వీడే ఆలోచన తనకు ఎప్పటికీ రాదని, ప్రాణం ఉన్నంతవరకూ అందులోనే కొనసాగుతానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా తనను మంచి మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు రుణ పడి ఉంటానన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న ఆరు గ్యారంటీ పథకాలను నియోజకవర్గంలో అర్హులందరికీ అందేలా చూస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం



కాంస్య పతకంతో విద్యార్థి సాహన్ రామన్

కోరుట్ల: పట్టణంలోని కోరుట్ల తైక్వాండో క్లబ్‌కు చెందిన విద్యార్థి శ్యామకూర సాహన్ రామన్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో తెలంగాణ తరఫున ఫైటింగ్ విభాగంలో పాల్గొని ఈ పతకం పొందాడు. సాహన్ రామన్‌తో పాటు కోచ్ నావనంది రమేశ్‌ను జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎస్పీ, కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, సిద్ధార్థ పాఠశాల కరస్పాండెంట్ దామోదర్ తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు తక్కళ్లపల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మల్యాల: మల్యాల మండలం తక్కళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. సుల్తాన్ వైష్ణవి(షాట్‌పుట్), మైలారపు అక్షయ(3కే రన్), రామడుగు వంశీ(1500మీటర్ల పరుగు)లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఈనెల 6 నుండి హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు మహేందర్, పీఈటీ గంగా సాగర్ విద్యార్థులను అభినందించారు.

10 మందికి నోటా కంటే తక్కువే!

మెట్‌పల్లి: ఈ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి 15మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో 10 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు పోలవ్వడం గమనార్హం. నోటాకు 1391 ఓట్లు వస్తే... వీరందరికి అంతకంటే తక్కువగా వచ్చాయి. వీరిలో సింహం గుర్తుపై పోటీ చేసిన చెన్నమనేని శ్రీనివాసరావు ప్రధాన పార్టీలకు ధీటుగా ప్రచారం చేశారు. అంతకు ముందు ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ, గల్ఫ్ సమస్యలపై ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలో నిలిచిన ఆయన ..ప్రధాన పార్టీలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రచారం చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. భారీగా ఓట్లు వస్తాయని ఆశించిన ఆయనకు నోటా కంటే తక్కువగా ఓట్లు రావడం తీవ్ర నిరాశకు గురిచేసింది.



దుబ్బరాజన్న సన్నిధిలో కార్తీక సందడి



సారంగాపూర్: స్థానిక దుబ్బరాజన్నను కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి కోడె మొక్కులు, కుంపటి, గజాశూలం, గండదీపం, అభిషేకం, అన్నపూజలు చేశారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ పాలకవర్గం పర్యవేక్షించింది.

క్లుప్తంగా

సొంతగూటికి చొక్కాల

- షర్మిల సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరిక


షర్మిల సమక్షంలో పార్టీలో చేరిన రాము

సిరిసిల్లటౌన్: ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన చొక్కాల రాము మళ్లీ సొంతగూటికి చేరుకున్నారు. గతంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆయన అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ఐటీ శాఖ మంత్రి తారకరామారావు సమక్షంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో ప్రాధాన్యం లోపించడంతో అనుచరులతో కలిసి సోమవారం లోటస్‌పాండ్‌లో వైఎస్సార్ టీపీ అధినేత్రి వై.ఎస్.షర్మిల సమక్షంలో పార్టీలో చేరగా.. ఆమె కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాము పేర్కొన్నారు. జిల్లాలో ముదిరాజ్ సంఘం, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమంలో కీలక నేతగా ఉన్న రాము.. మళ్లీ సొంతగూటికి చేరడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని సోమవారం రాత్రి ఢీకొట్టి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన ముదాం చిన్న తిరుపతి అనే యువకుడు వేములవాడ పట్టణం నుంచి స్వగ్రామమైన మల్యాల గ్రామానికి వెళ్తుండగా.. మల్యాల గ్రామ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తలకు ఉన్న హెల్మెట్ పగిలి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో తిరుపతిని అంబులెన్స్‌లో వేములవాడకు తరలించారు. వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పినట్లు తెలిపారు. చందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సారంగాపూర్: వరి కోత యంత్రం ఢీకొనడంతో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఒడ్డెర కాలనీకి చెందిన అల్లెపు పెద్ద ఎల్లయ్య(52), అతడి భార్య నర్సవ్వ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై ఈనెల 1న రంగపేట గ్రామం నుంచి బట్టపల్లి గ్రామం వైపు వెళ్తున్న క్రమంలో రేచపల్లి గ్రామ శివారులో మహేశ్ అనే వ్యక్తి వరి కోత యంత్రం అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ వారిని ఢీకొట్టాడు. దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడగా.. వారిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎల్లయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

సజావుగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికలు

- ఒత్తిడిని జయించిన యంత్రాంగం
- ఎలాంటి ఘటనలు లేకుండా చర్యలు
- విధుల్లో సఫలీకృతులైన ఉద్యోగులు
- రెవెన్యూ, పోలీస్ శాఖలపైనే అధిక పనిభారం


పెగడపల్లి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు(ఫైల్)

పెగడపల్లి: జిల్లాలో సాధారణ ఎన్నికలు సజావుగా జరగడంతో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడ ఎలాంటి ఘటనలు జరగకపోవడంతో అన్ని వర్గాల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఈ ఎన్నికల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ శాఖలు ప్రధాన పాత్ర పోషించాయి. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వ్యవస్థ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. జిల్లా పోలీసులతో పాటు కేంద్ర బలగాలు ఇక్కడ బందోబస్తు నిర్వహించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఏ చిన్న ఘర్షణ గానీ.. మరే ఇతర గొడవలు జరగకుండా విధులు నిర్వర్తించారు. కేంద్రాల వద్ద ఓటర్లకు వసతుల కల్పనలో రెవెన్యూ యంత్రాంగం విజయవంతమైంది.

ఇంటి వద్దే..

ఓటు హక్కు ఉన్న దివ్యాంగులు, 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఈసారి ఇంటి వద్దే ఓటింగ్ వేసేందుకు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు గర్భిణులు, బాలింతలతో ఓటేయించడంలో చూపిన చొరవ అభినందనీయం. పిల్లలను ఆడించడం.. వారికి తినుబండారాలు తినిపించడం వంటి సపర్యలు చేశారు. ఓటుకు దూరంగా ఉంటారనుకున్న వారు కూడా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా చూశారు. శాసనసభ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల విషయాల్లో సఫలీకృతమైందని చెప్పొచ్చు. జిల్లాలో అన్ని మండలాల నుంచి ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది మాత్రం తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. ఉన్నతాధికారుల నుంచి రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌వోలు, కిందిస్థాయి సిబ్బంది అర్ధరాత్రి వరకు కార్యాలయాల్లోనే ఉండిపోయారు. తిరిగి ఉదయం 8 గంటలకే కార్యాలయాలకు వచ్చి విధుల్లో చేరారు. ఎన్నికలకు రెండు రోజుల నుంచయితే అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు సంబంధించి పనులు దగ్గరుండి పరిశీలించారు. దివ్యాంగుల విషయానికొస్తే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు. పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్లను ఏర్పాటు చేయడంతో.. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు కూడా ఓటు హక్కును వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

విధుల్లో పాల్గొన్న శాఖలు

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికలు జరిగాయంటే రెవెన్యూ, పోలీస్ శాఖ మొదలుకొని సుమారు 20 శాఖల అధికారుల పాత్ర ఉందని చెప్పుకోవచ్చు. వారంతా ఓటు నమోదు మొదలుకొని పోలింగ్ పూర్తయ్యేవరకు కీలక భూమిక పోషించారు. ఫలితంగా చైతన్యం వెల్లివిరిసింది. జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండలాల్లోని ఎన్నికల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, రెవెన్యూ ఇలా తలో ఇద్దరు చొప్పున ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నలుగురు నుంచి అయిదుగురు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 25వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. ఉదయం పది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనుల్లో నిమగ్నమాయ్యరు. ఇలా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో దాదాపు 20 శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేశారు. ఎన్నికల విధుల్లో శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకం. ఇందులో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బందిపై కూడా తీవ్రంగానే ఒత్తిడి పెరిగింది. పోలీసు ఠాణా సిబ్బంది నుంచి ఎస్‌హెచ్‌వోలు, సీఐలు, డీఎస్పీలు, ఏఎస్పీ వరకు అర్ధరాత్రి వరకు జాగారం చేశారు. ఎప్పటికప్పుడు సమీక్షలు, పర్యవేక్షణలకు పెద్దపీట వేశారు. ఫలితంగా ఎక్కడా చెప్పుకోదగ్గ ఘటనలు జరగలేదు. విధులపై ఎలాంటి ఆరోపణలు కూడా వచ్చిన దాఖలాల్లేవు. అయితే అంతకుముందు నుంచే రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. అత్యవసర సమయాల్లో మినహాయించి అన్ని రకాల సెలవులను కూడా రద్దు చేశారు. సెలవు రోజుల్లోనూ విధులకు పరిమితమయ్యారు. దీంతో చాలామంది సిబ్బందిపై ఒత్తిడి ప్రభావం చూపిందని తెలుస్తోంది. పోలింగ్ ప్రక్రియ ముగిసినా రెవెన్యూ అధికారులపై పనిభారం తగ్గలేదు. ఎందుకంటే ఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది కౌంటింగ్ కేంద్రాలకు పరిమితమయ్యారు. ఆదివారం ఓట్ల లెక్కింపు పూర్తవ్వడంతో అందరిపైనా ఒత్తిడి తగ్గింది. ఎన్నికల కారణంగా నిలిచిపోయిన సాధారణ పరిపాలన సేవలు తిరిగి అందుబాటులోకి రానున్నాయి. ప్రధానంగా ప్రజావాణి, వివిధ రకాల ధ్రువపత్రాల జారీ, పట్టాదారు పాసు పుస్తకాల్లో చేర్పులు, మార్పులు చేయడం లాంటి పనులు, పోలీస్ శాఖలో కేసుల విచారణ, ఇతర నేరాల కేసుల దర్యాప్తు వంటివి తిరిగి ప్రారంభం కానున్నాయి.

కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు


స్వీట్లు పంచుకుంటున్న సింగరేణి ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ: మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్ బాబు గెలుపుపై ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌లో కాంగ్రెస్ మైనారిటీ సీనియర్ నాయకుడు మురాద్ ఖాన్ (మతిన్) ఆధ్వర్యంలో నాయకులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. సింగరేణి ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. శ్రీధర్‌బాబు మంత్రి హోదాలో సింగరేణి ఏరియాలో అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైజీఎం ఎర్రన్న, ఎస్ఈ రాంరెడ్డి, ఇంజినీర్ సంజీవ్, ఫోర్‌మెన్లు రామారావు, బాబు, రాజ్‌కుమార్, ప్రభాకర్ రెడ్డి, దశరథం, శ్రీనివాస్, రవీందర్, రఫీక్, ఇజాజ్ ఖాన్, కృష్ణ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: రామగుండం ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ ఘన విజయం సాధించడంతో ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబా, సత్యంల ఆధ్వర్యంలో మక్కాన్‌సింగ్ సోదరుడు అయోధ్య సింగ్ కార్మికులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఆయన ముందుంటారని అన్నారు.



రాజన్న సాక్షిగా భక్తుల కష్టాలు

వేములవాడ: కార్తీక మాసం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. సోమవారం వేలాదిగా తరలిరావడంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. సరైన సౌకర్యాల్లేక అవస్థలు పడ్డారు. మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్యం సక్రమంగా లేక భక్తులు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించేందుకు అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పవిత్రంగా వెలిగించిన దీపాల వద్దకు జనం వస్తుండటంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని వరంగల్‌కు చెందిన లక్ష్మణ్, రాజేశ్వరి, ముకుందం సాక్షితో అన్నారు.

చీకట్లోనే మొక్కులు..

భక్తులు సోమవారం రాత్రి చీకట్లోనే బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకోవాల్సి వచ్చింది. తాత్కాలికంగా వేసిన చలువ పందిళ్లు, క్యూలైన్లలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అవస్థలు పడాల్సి వచ్చింది.



ఇరువర్గాల మధ్య ఘర్షణ

జగిత్యాలరూరల్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడగా.. గెలుపొందిన అభ్యర్థుల కార్యకర్తలు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నా టపాసులు పేల్చడంతో పాటు డీజేలు పెట్టి హంగామా సృష్టించారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో.. ఓ పార్టీకి చెందిన కార్యకర్త పలువురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్లు ధ్వంసం చేయడంతో పాటు స్టార్టర్లు పగలగొట్టాడు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హైదర్‌పల్లి, చల్‌గల్ గ్రామాల్లో ఆదివారం రాత్రి రెండువర్గాల వారు వాగ్వాదానికి దిగారు.


లక్ష్మీపూర్‌లో ధ్వంసమైన విద్యుత్ మోటారు, స్టార్టర్


ధ్వంసమైన డ్రిప్ ట్యాంకర్





వైభవంగా మహాలింగార్చన

వేములవాడ: కార్తీక సోమవారం సందర్భంగా రాత్రి రాజన్న సన్నిధిలోని మహామంటపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం రెండు గంటలపాటు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వెల్గటూర్: ఎక్స్‌వేటర్ ఆపరేటర్ నిర్లక్ష్యంతో ఒకరు మృతిచెందారు. ఆదివారం మండల కేంద్రంలో కాళేశ్వరం లింక్–2 పనుల్లో భాగంగా సర్జిపుల్ డీటీ–5 వద్ద మెఘా కంపెనీకి చెందిన ఎక్స్‌వేటర్ పని చేస్తుండగా.. ఎక్స్‌వేటర్ ఆపరేటర్ వెనకకు తిప్పడంతో వాహనం వెనకాల క్లీనర్ పని చేస్తున్న సుభాష్‌ను ఢీకొంది. రెండు కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావం జరిగింది. క్షతగాత్రుణ్ని కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. సోమవారం పంచనామా నిర్వహించి అతడి భార్య సీమ కుమారికి అప్పగించారు. కంపెనీ అడ్మిన్ బొల్లం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

సమష్టి కృషితోనే కాంగ్రెస్ విజయం

యైటింక్లయిన్‌కాలనీ: జిల్లా పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితోనే కాంగ్రెస్ విజయం సాధించిందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి అన్నారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీలోని ఐదు డివిజన్లతోపాటు రామగిరి మండలంలోని వెంకట్రావుపల్లి పంచాయతీ పరిధి కేకే నగర్, కుమారస్వామి నగర్, షాపింగ్ కాంప్లెక్స్ తదితర ఏరియాలకు చెందిన ప్రజలు కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓటు వేసి, గెలిపించారని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను, మంథనిలో శ్రీధర్ బాబును భారీ మెజారిటీతో గెలిపించిన సింగరేణి కార్మికులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, నాయకులు మార్క రాజు, రాములు, తిరుపతి రెడ్డి, సారయ్య, రాజేశం, యాదగిరి తిరుపతి, వీరారెడ్డి, చాట్ల సదానందం, రమేశ్ రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరఫున పోరాటం చేస్తాం

- బీజేపీ రామగుండం అభ్యర్థి కందుల సంధ్యారాణి

గోదావరిఖని(రామగుండం): సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరఫున పోరాటం చేస్తామని రామగుండం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి, ఓడిపోయిన కందుల సంధ్యారాణి తెలిపారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాషాయ జెండాను ఎట్టిపరిస్థితుల్లో వీడేది లేదని, రాబోయే కార్పొరేషన్, ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. తన విజయం కోసం అహర్నిశలు శ్రమించిన అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో బీజేపీకి మంచి మెజారిటీ వచ్చిందని పేర్కొన్నారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి పని చేస్తానని తెలిపారు. నాయకులు గాండ్ల ధర్మపురి, వడ్డేపల్లి రామచంద్రం, సుల్వ లక్ష్మీనర్సయ్య, కోమల మహేశ్, కొండపర్తి సంజీవ్‌కుమార్, గోపగోని నవీన్‌గౌడ్, గాండ్ల స్వరూప, మూకిరి రాజు, బోడకుంట జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులు.. 25 మోటార్లు..

- వరుస చోరీలతో అన్నదాతలను హడలెత్తిస్తున్న దొంగల ముఠా
- ఒక్కో విద్యుత్ మోటార్ ఖరీదు రూ.20–25వేలు
- ఆదుకోవాలని రైతుల కన్నీటి వేడుకోలు


పొలాస శివారులో నట్లు తొలగించి విద్యుత్ మోటార్‌ను ఎత్తుకెళ్లిన వైనం


ఎస్సారెస్పీ కాలువకు పెట్టిన మోటార్లను ఎత్తుకెళ్లిన దొంగలు

జగిత్యాలఅగ్రికల్చర్: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాలు ప్రతి ఏటా రైతులను దెబ్బతీస్తుంటే.. ఇది చాలదన్నట్టు రూపాయి రూపాయి కూడబెట్టి వ్యవసాయ బావులు, ఎస్సారెస్పీ కాలువకు బిగించుకున్న విద్యుత్ మోటార్లను రాత్రికి రాత్రి దొంగలు ఎత్తుకెళ్తూ రైతులకు కన్నీళ్లు మిగిల్చుతున్నారు. ఇటీవల జిల్లాలో ఏదో ఓ చోట రైతులు బిగించుకున్న విద్యుత్ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లడం, ఆయా పోలీస్ స్టేషన్లలో రైతులు ఫిర్యాదు చేయడం పరిపాటిగా మారింది. వారం రోజులుగా జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్, లక్ష్మీపూర్, పొలాస శివారులో వ్యవసాయ బావులకు బిగించుకున్న దాదాపు 25 విద్యుత్ మోటార్లను రాత్రివేళల్లో దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 3 లక్షలు..

జిల్లాలో 3 లక్షల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లుంటాయి. వ్యవసాయ బావులు, బోర్లు, ఎస్సారెస్పీ, వరద కాల్వలకు విద్యుత్ మోటార్లు బిగించుకొని రైతులు పంటలు పండించుకుంటున్నారు. రైతులు నీటి సామర్థ్యాన్ని బట్టి 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ సామర్థ్యం గల విద్యుత్ మోటార్లు బిగించుకుంటున్నారు. 24 గంటల కరెంట్ ఉండటంతో పాటు ఆటోమెటిక్ ఆన్, ఆఫ్ సిస్టమ్ రావడంతో రైతులు ప్రతిరోజు విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లడం లేదు. వరి సాగు చేసిన రైతులు సైతం ప్రతిరోజు ఉదయం మోటార్ల వద్దకు వెళ్తుంటారు. రాత్రి రైతులు మోటార్ల వద్దకు వచ్చే అవకాశం లేకపోవడంతో.. దొంగలు మోటార్లను ఎత్తుకెళ్తున్నారు.

లబోదిబోమంటున్న రైతులు

రైతులు వ్యవసాయ బావి తవ్వడం లేదంటే బోరు వేయించేందుకు దాదాపు రూ.1–2లక్షలు ఖర్చు పెడుతుంటారు. బావులు, బోర్లకు బిగించేందుకు కొత్త 3 హెచ్‌పీ విద్యుత్ మోటార్‌కు 25వేలు, 5 హెచ్‌పీ మోటార్‌కు రూ.30వేలు ఖర్చు వస్తుంది. ఒకవేళ పాత 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటార్లు కొందామన్నా.. కనీసం రూ.15–20వేల వరకు ఖర్చు వస్తుంది. అయినా పాత మోటార్లు దొరకని పరిస్థితి ఉంది. ఇటీవల నీళ్లలో ఉండే మోటార్లకు రైతులు ప్రాధాన్యమిస్తున్నా.. వాటి ధర రూ.35–40వేల వరకుండటంతో పాటు జిల్లాలో వ్యవసాయ బావులన్నీ కూడా 5–6 గజాల లోతులోనే ఉండటం, ఎక్కువగా రాళ్లు ఉండటంతో, మోటార్ ఆన్ చేసి పోతే 2–3 గంటల్లోనే నీరు అయిపోతుంది. దీంతో రైతులు ఎక్కువగా భూమిపైన ఉండే మోటార్లను వాడుతున్నారు. ఎస్సారెస్పీ, వరద కాల్వకు మోటార్లు పెట్టి, 4–5కి.మీ. దూరం నీరు తీసుకెళ్తుండటంతో.. వాటికి 5 హెచ్‌పీ, 10 హెచ్‌పీ మోటార్లు వాడుతున్నారు. దొంగలు ఎక్కువ హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లను ఎత్తుకెళ్లేందుకు చూస్తున్నారు.

ఎందుకు ఎత్తుకెళ్తున్నారంటే..

దొంగలు మోటార్లను ఎత్తుకెళ్లి, భాగాలన్ని విడదీసి, ఒక్కో భాగాన్ని ఒక్కోచోట అమ్ముతుంటారు. లేదంటే ఇతర జిల్లాలకు తీసుకెళ్లి పాత మోటార్లుగా అమ్ముతుంటారు. సాధారణంగా మోటార్‌లోని రాగిని ఓచోట, మిగతా మోటార్ బాడీని మరోచోట అమ్ముతుంటారు. ప్రస్తుతం ఒక్క మోటార్‌ను ఎత్తుకెళ్లి, తీగ ద్వారా రూ.3వేల వరకు, మిగతా విడి భాగం ద్వారా రూ.4వేల వరకు, మొత్తం రూ.7వేలు సంపాదిస్తున్నారు. దొంగిలించిన మోటార్‌ను పాత మోటార్‌గా రూ.10వేల వరకు విక్రయిస్తారు. 3 హెచ్‌పీ మోటార్‌లో 4 కిలోల రాగి తీగుంటుంది. 5 హెచ్‌పీ మోటార్‌లో 5 కిలోల రాగి తీగుంటుంది. ప్రస్తుతం ఒక కిలో రాగి తీగ ధర రూ.850(పాతది), రూ.1,300(కొత్తది) మార్కెట్లో పలుకుతోంది. మోటార్లు ఎత్తుకెళ్లడం ఒక్కరి వల్ల అయ్యే పని కాదు. ముఠాగా ఏర్పడి ఎత్తుకెళ్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. మోటార్, పంపు సెట్‌కు మధ్య నాలుగు నట్‌బోల్టులుంటాయి. ఫ్యూజ్ బాక్స్ నుంచి సర్వీస్ తీగలుంటాయి. సర్వీస్ తీగను కట్ చేయడం, నట్‌బోల్టులను ఓ పరికరంతో తీసి నేరుగా మోటార్లు ఎత్తుకెళ్తున్నారు. దొంగలు సైతం పక్కా ప్రణాళికతో చిన్నపాటి ట్రాలీ ఆటో వెళ్లే మార్గంలోనే మోటార్లను దొంగిలిస్తున్నట్లు ఇటీవల జరిగిన దొంగతనాలను బట్టి స్పష్టమవుతోంది. ఒకచోట దొంగతనం చేసి, వాటిని మరో జిల్లాలో అమ్మడం చేస్తూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు.

నా మోటార్‌ను ఎత్తుకెళ్లారు



నేను పొలానికి పెట్టుకున్న రూ.30వేల విలువ గల మోటార్‌ను ఆదివారం ఎత్తుకెళ్లారు. మా ఊర్లో దాదాపు ఓ 10 మంది మోటార్లు, జాబితాపూర్‌లో మరో 20 మందివి మోటార్లు ఎత్తుకెళ్లారు. మోటార్ల దొంగలపై పోలీసులు రాత్రి గస్తీ చేపట్టి రైతులను ఆదుకోవాల్సిన అవసరముంది.

– తీపిరెడ్డి బాపురెడ్డి, లక్ష్మీపూర్, జగిత్యాల రూరల్

ఫిర్యాదు చేశాం



మా సంస్థ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం పగలగొట్టి రాగి తీగ ఎత్తుకెళ్తున్నారు. బావుల వద్ద రైతులు పెట్టుకున్న మోటార్లను ధ్వంసం చేసి రాగి తీగ ఎత్తుకెళ్తున్నారు. వీటిపై ఎక్కడికక్కడే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా ఎస్పీ దృష్టికి సైతం తీసుకెళ్లాం.

– సత్యనారాయణ, జిల్లా విద్యుత్ శాఖాధికారి, జగిత్యాల